సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024

వ్యాసరచన పోటీల విజేతలు వీరే

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గతనెల 28న వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో జెడ్పీఎస్ఎస్ ఇంద్రవెల్లికి చెందిన అక్షిత (ప్రథమ), జెడ్పీఎస్ఎస్ బేలకు చెందిన ప్రసన్న (ద్వితీయ), ఆదిలాబాద్ గెజిటెడ్ నం.1 పాఠశాలకు చెందిన కీర్తి(తృతీయ) బహుమతి కైవసం చేసుకున్నారు. అక్షిత 3న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నేడు దూర విద్య తరగతులు

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి డిగ్రీ, పీజీ కాంటాక్ట్ కమ్ కౌన్సెలింగ్ తరగతులు ఆదివారం నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ జగ్‌రాం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్, పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

గిరి గ్రామాల అభివృద్ధిపై దృష్టి



ఆదివాసీలు, అధికారులతో కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్: ఏజెన్సీ పరిధిలోని ఆదివాసీ, గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో ఆదివాసీ పెద్దలు, వివిధ శాఖల అధికారులతో గిరిజన సమస్యలపై శనివారం సమీక్షించారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తాగునీరు, విద్య, వైద్య తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మేస్రం దుర్గు పటేల్, ఝరి రాయిసెంటర్ సార్ మేడి దౌలత్‌రావు, యోగేష్, శేఖర్, లింగు, నాగరావు, రూప్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కైలాస్‌నగర్: జిల్లాలో పూర్తయిన 567 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రగతిపై పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో శనివారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.3.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.ఈమేరకు ప్రతిపాదనలు అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇందులో హౌసింగ్ నోడల్ అధికారి బసవేశ్వర్, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఈఈలు శివరాం రాథోడ్, నర్సయ్య, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ.20కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల

కైలాస్‌నగర్: స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు రూ.20 కోట్లను ప్రణాళిక శాఖకు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం మేరకు ఆ నిధులతో కూడిన పనుల ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీలు గతంలోనే అందజేసి పనులు సైతం చేపట్టారు. అందులో కొన్ని పూర్తయ్యాయి. ఈ మేరకు వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుంది. ఆ దిశగా జిల్లా ప్రణాళిక శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠురహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ చాంబర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 2నుంచి 15వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 1002 మంది ఆశ కార్యకర్తలు, 200 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఆశలు ఇంటింటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 2027 నాటికి కుష్ఠురహిత దేశంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శరీరంపై ముదురు గోధుమ రంగులో స్పర్శలేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్ఠును ప్రారంభ దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో 57 మంది చికిత్స పొందుతున్నట్లు వివరించారు. ఇందులో ప్రోగ్రాం అధికారి గజానంద్, డీపీఎంవో వామన్‌రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తలమడుగు: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మండలంలోని బరంపూర్ గ్రామంలో కొండపై గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టైగర్ టెన్షన్!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు సురేశ్



- మరోసారి పెద్దపులి అలజడి
- సిర్పూర్(టి) మండలం దుబ్బగూడలో రైతుపై దాడి
- కాగజ్‌నగర్‌లో మహిళను చంపిన మరుసటిరోజే ఘటన
- అదేపులి దాడి చేసినట్లు భావిస్తున్న అధికారులు
- డ్రోన్ కెమెరాతో గాలించినా దొరకని బెబ్బులి ఆచూకీ
- సరిహద్దు దాటే అవకాశం ఉన్నట్లు అంచనా
- గ్రామ స్థాయిలో రక్షణకు ప్రత్యేక కమిటీలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి/సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్దపులి మరోసారి అలజడి రేపింది. పత్తిచేనులో మహిళను చంపిన ఘటనను మరువక ముందే శనివారం మరొకరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఇద్దరిపై దాడిచేసింది ఒకే పెద్దపులి అని అధికారులు భావిస్తున్నారు. వరుస ఘటనలతో అటవీ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గాయపడిన బాధితుడికి అటవీశాఖ ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్నామని ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం విలేజ్ నం.13లో మహిళపై దాడి చేసిన పులి.. సిర్పూర్(టి)లోని దుబ్బగూడ పత్తి చేనులో సురేశ్‌పై శనివారం దాడి చేసిన పెద్దపులి ఆనవాళ్లు ఒకేవిధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు కోసం ఆనవాళ్లు హైదరాబాద్‌కు పంపించామని వెల్లడించారు.

తిరుగుతున్న పులులెన్ని..?

మహారాష్ట్రలో ఇరుకు ఆవాసాలతో పులులు తోడు, ఆవాసం కోసం ఇటువైపు పదుల సంఖ్యలో వస్తున్నాయి. కవ్వాల్ పరిధిలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల డివిజన్ల వరకు సంచరిస్తున్నాయి. తిప్పేశ్వర్ నుంచి ఆదిలాబాద్, నిర్మల్, కుంటాల, బోథ్, ఉట్నూరు, కెరమెరి మండలం జోడేఘాట్ పరిధి అటవీ గ్రామాల వరకు తిరుగుతున్నాయి. గత నెలలో రోడ్డుపైనే నేరుగా వాహనదారులకు కనిపించి బెంబేలెత్తించాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో అంకుసాపూర్ పరిసర ప్రాంతాల్లో పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాయి. మనుషులపై దాడిచేసిన పులి వివరాలు గతంలో ఇక్కడ రికార్డు కాలేదు. ప్రస్తుతం పెంచికల్‌పేట్, బెజ్జూర్ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లోనూ కొంతమంది పులిని చూసినట్లుగా అధికారులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు ఆరెగూడ సమీపంలో సైతం పులి కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. సిర్పూర్(టి)లో రైతుపై దాడి చేయగా, సమీపంలోనే రెండు పులులు కొట్లాడుతుండగా చూసినట్లు ఓ రైతు తెలిపాడు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రెండు కొత్తపులులు సంచరిస్తున్నాయి. ఇవే కాకుండా మరో పులి ఈ దాడులు చేసి ఉండొచ్చని ప్రాథమికంగా గుర్తించారు.

టెక్నాలజీ వినియోగమేది..

అత్యవసర సమయంలో సిబ్బందిని సమాయత్తం చేసి టెక్నాలజీ వినియోగించుకోవాల్సి ఉండగా, ఆ విషయంలో కాగజ్‌నగర్ డివిజన్ అటవీ విభాగం విఫలమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇద్దరిపై దాడికి పాల్పడినా పులి ఆచూకీ కనిపెట్టకపోవడం, జాడపై స్పష్టత లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. అడవుల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని చెబుతున్నా ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమవుతున్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో మహిళపై దాడి చేసిన ఘటన ప్రాంతానికి అటవీశాఖ బృందానికంటే ముందే గ్రామస్తులు, నాయకులు చేరుకోవడం గమనార్హం.

ఇవి పాటిస్తే మేలు

- అటవీ ప్రాంతం గుండా వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలి
- తెల్లవారు జామున, రాత్రి వరకు చేలలో ఉండకూడదు
- గుంపులుగా వెళ్తూ తల వెనకవైపు మాస్క్ ధరించాలి
- చప్పుళ్లు చేసేలా చేతికర్రలు, పశువులకు గంటలు కట్టుకోవాలి
- చిన్న పిల్లలను అటవీ ప్రాంతాలకు ఉదయం, రాత్రి వేళ తీసుకెళ్లొద్దు
- పులులు, వన్యప్రాణుల సంచారంపై అధికారులతో తెలుసుకోవాలి
- పులి అడుగులు, వెంట్రుకలు, ఆనవాళ్లు కనిపిస్తే సమాచారమివ్వాలి
- రక్షణ దళంగా ఏర్పడి పులులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

నిరంతరం అప్రమత్తం

పులి కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉన్నాం. దాడి చేసిన పులి మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో ఉన్నట్లు గుర్తించాం. గ్రామ రక్షణ కమిటీలతో ప్రజలు పలు సూచనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– నీరజ్‌కుమార్, డీఎఫ్‌వో, ఆసిఫాబాద్

చేన్లకు వెళ్లాలంటే భయంగా ఉంది



పులుల దాడులతో చేన్లకు వెళ్లాలంటే భయంగా ఉంది. మా చేన్లవైపు కూడా వస్తుందేమోనని భయంగా ఉంది. అటవీ అధికారులు పులులను పత్తి చేన్ల వైపు రాకుండా ఏర్పాట్లు చేయాలి.

– కారు ప్రమీల, గ్రామం: కొండపల్లి, మం: పెంచికల్‌పేట్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా

గమ్యం ఎటువైపు..?

జిల్లాలోని కెరమెరి, జైనూర్, వాంకిడి, ఆసిఫాబాద్, సిర్పూర్(యూ), కాగజ్‌నగర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్ అటవీ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా పులులు, చిరుతలు సంచరిస్తున్నాయి. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లో మాత్రమే పులి మనుషులపై దాడికి పాల్పడింది. కాగజ్‌నగర్ మండలం గన్నారం సమీపంలో దాడి చేసి అనంతరం అక్కడి నుంచి అటవీప్రాంతం గుండా సిర్పూర్(టి) అడవుల్లోకి చేరుకునే అవకాశం ఉంది. కాగజ్‌నగర్ నుంచి ప్రధాన రహదారి, రైల్వేలైను దాటి సిర్పూర్(టి) వెనుక నుంచి దుబ్బగూడ గ్రామానికి చేరుకుని మరో రైతుపై దాడికి పాల్పడింది. అనంతరం ఇటిక్యాల పహాడ్ సమీపంలో లేగదూడపై దాడి చేసి చంపింది. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో పులి ఉన్నట్లుగా భావిస్తుండగా, అది మహారాష్ట్రలోకి వెళ్లిపోతే ఇక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకోవచ్చు. కానీ ఈ మార్గం గుండా తరచూ పులులు రాకపోకలు నమోదవుతున్నాయి. ఘటనలు పునరావృతం కాకుండా అటవీశాఖ మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



పులి జాడ కోసం డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

గ్రామ రక్షణ కమిటీలు



తల వెనుక భాగంలో ఫేస్‌మాస్క్‌లు

ఇద్దరూ పత్తి చేన్లలో ఉండగానే దాడి జరిగింది. దీంతో పత్తి చేన్లకు వెళ్లాలంటే రైతులు, కూలీలు వణుకుతున్నారు. ఈ ఘటనలను అటవీశాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఇప్పటికే డ్రోన్ సాయంతో అడవుల్లో పులి సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. అటవీ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అడుగులు, గుర్తులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దుకు ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు గుర్తించారు. ఇక ఆసిఫాబాద్ జిల్లా స్థాయిలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రక్షణ కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. వన్యప్రాణులు, స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు వహించేలా సలహాలు, సూచనలు పాటించేలా కమిటీలు పర్యవేక్షిస్తాయి.

చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: పులిదాడిలో మృతిచెందిన కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి కుటుంబ సభ్యులకు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ శనివారం చెక్కులు అందజేశారు. ఇరుకుటుంబాల అంగీకారంతో మృతురాలి భర్త మోర్లె వాసుదేవ్‌కు రూ.ఐదు లక్షలు, మృతురాలి తల్లి వడాయి విమలకు రూ.ఐదు లక్షల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, కొప్పుల శంకర్, సిందం శ్రీనివాస్, నీరటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయనొస్తే.. ఆహ్వానమే



ఆహ్వాన పత్రిక పంచుతున్న వెంకటస్వామి

సండే స్పెషల్

- సాంకేతిక యుగంలోనూ సంప్రదాయ రాయబారి
- మూడు దశాబ్దాలుగా శుభకార్యాలకు 'పిలుపు'
- ప్రత్యేకత చాటుకుంటున్న వెంకటస్వామి

ఇంట్లో ఏదైనా శుభకార్యం ఉందంటే ఊరిలో ప్రతి ఇంటికి వెళ్లి సంప్రదాయబద్ధంగా బొట్టు పెట్టి ఆహ్వాన పత్రికను అందించేవారు. ఫలానా తేదీన ఈ శుభముహూర్తంలో వివాహం, బారసాల, గృహవసతి, నామకరణం, కేశఖండనం ఇలా శుభకార్యం ఏదైనా సరే ఉందని చెబుతూ సాదరంగా ఆహ్వానించేవారు. ఒకవేళ ఇంట్లో ఎవరు లేకపోతే గుమ్మానికి కుంకుమ పెట్టి కార్డును తలుపు వద్ద ఉంచేవారు. అయితే కాలంతో పాటు పిలుపులోనూ మార్పు వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా ఇన్విటేషన్ అందిస్తున్నారు. ఫోన్ చేసి రావాలని అయినా కోరుతున్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాత్రం భట్టుమూర్తి వెంకటస్వామి కనిపిస్తే చాలు.. తమకేదో ఆహ్వానం వచ్చిందని ఇంటిల్లిపాది అర్థం చేసుకుంటారు. అతను వస్తే శుభకార్యం ఏదో ఉందని భావిస్తారు. ఎవరీ భట్టుమూర్తి వెంకటస్వామి.. ఏమా కథ.. తెలుసుకుందాం రండి.

– ఆదిలాబాద్

మూర్తి వస్తే ముహూర్తమున్నట్టే..

ఫోన్ల ద్వారా సమాచారం అందించి మొక్కుబడిగా శుభకార్యాలకు ఆహ్వానం పలుకుతున్న ఈ రోజుల్లో ఓ వ్యక్తి ఇంటింటికి తిరుగుతూ ఆహ్వాన పత్రికలు అందిస్తూ ఇన్విటేషన్ అందించడం విశేషమనే చెప్పాలి. పట్టణంలో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, డాక్టర్లు, లాయర్లు, సామాన్యులు ఇలా ఎవరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా ఆయన ద్వారా పత్రికలు అందించి సాదరంగా ఆహ్వానిస్తారు. ఇంటివారు ప్రత్యేకంగా రాకపోయినా జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్‌కు చెందిన భట్టుమూర్తి పత్రిక ఇస్తే శుభకార్యానికి తప్పకుండా వెళతారు.

పేరు చెబితే చాలు..

పోస్ట్‌మెన్ ఇంటికి రావాలన్నా కవర్‌పై అడ్రస్ చూడాలి. చుట్టుపక్కల ల్యాండ్ మార్క్ తెలుసుకొని సంబంధిత చిరునామాకు అందించి వెళ్తాడు. అలాగే కొరియర్ వచ్చినా స్పష్టమైన లొకేషన్ ఉంటేనే సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకొని తీసుకువెళ్లి ఇస్తారు. అయితే వెంకటస్వామికి పేరు చెబితే చాలు పట్టణంలో ఏ మూలనైనా వారి ఇంటికి పత్రికలు చేరవేస్తాడు. జిల్లా కేంద్రానికి చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధికారులు, వ్యాపారులు, ప్రముఖులు, సామాన్యులు ఇలా ప్రతీ ఇల్లు ఆయనకు సుపరిచితమే. 30ఏళ్లుగా ఏ శుభకార్యమున్నా ఇంటింటికి వెళుతూ ఆహ్వాన పత్రికలు అందిస్తున్నాడు. ప్రతిరోజు 500 వరకూ కార్డులు పంచుతాడు. ముఖ్యంగా వివాహాల సీజన్ సమయంలో తీరిక లేకుండా ఉంటాడు.

మొదట్లో సైకిల్‌పై వెళ్లి కార్డులు ఇచ్చేవాణ్ణి



మా నాన్న భట్టుమూర్తి హనుమాండ్లు పెళ్లి సంబంధాలు కుదిర్చేవారు. ఆయన వారసత్వాన్ని స్వీకరించి ప్రస్తుతం నేను ఆదిలాబాద్‌లో పెళ్లి, శుభకార్యాలకు సంబంధించిన పత్రికలు పంచుతున్నాను. అన్ని కులాలకు చెందిన వారి ఇళ్లు నాకు తెలుసు. ప్రత్యేకంగా డైరీ, రూట్ మ్యాప్ సైతం రూపొందించుకున్నాను. మొదట్లో సైకిల్‌పై వెళ్లి కార్డులు ఇచ్చే వాడిని. ఇప్పుడు మోటార్ సైకిల్‌పై వెళ్లి పత్రికలు అందిస్తున్నాను. ఒక్కో శుభకార్యానికి సంబంధించి 1000 కార్డులు మొదలుకొని ఐదు వేల వరకు పంచిపెడతాను.

– భట్టుమూర్తి వెంకటస్వామి

పెరిగిన కుటుంబాలు @ 59,463

- ఆదిలాబాద్ అర్బన్‌లో అధికం
- గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి
- సమగ్ర కుటుంబ సర్వేలో వెల్లడి

కైలాస్‌నగర్: జిల్లాలో కొత్తగా 59,463 కుటుంబాలు పెరిగాయి. ఈ నెల 6 నుంచి 18 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1,62,046 కుటుంబాలు ఉండగా తా జాగా నిర్వహించిన సర్వేలో 2,21, 509 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. సర్వే వందశాతం పూర్తి చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక ఇళ్లు ఇప్పటికీ సర్వేకు నోచుకోకపోవడం గమనార్హం. పకడ్బందీగా సర్వే నిర్వహించినట్లైతే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జిల్లా కేంద్రంలోనే అధికం..

జిల్లాలో ఇప్పటి వరకు 18 మండలాలు ఉండగా.. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇటీవల కొత్తగా సా నాల, భోరజ్, సాత్నాల మండలాలు ఏర్పడ్డాయి. నూతన మండలాల్లోని జనాభాను 2011తో పోల్చితే తీవ్ర వ్యత్యాసం ఏర్పడింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో అత్యధికంగా 13,549 కుటుంబాలు పెరగగా, ఉట్నూర్ మండలంలో 5,460, ఇచ్చోడలో 4,403 పెరిగాయి. మిగతా అన్ని మండలాల్లోనూ కుటుంబాల సంఖ్య పెరగడం జనాభా పెరుగుదలకు నిదర్శనం.

కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియ

సమగ్ర సర్వేలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ కుటుంబాన్ని ఎన్యుమరేటర్లు సర్వే చేసి వివరాలు సేకరించారు. ఈ సమాచారాన్ని ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,21,509 ఇళ్లకు గాను 68,244 ఇళ్ల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ఇప్పటి వరకు వివిధ కారణాలతో నత్తనడకన సాగగా ప్రస్తుతం వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించినట్లయితే డేటా ఎంట్రీ ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశముంది.



సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్(ఫైల్)

మండలాల వారీగా కుటుంబాల వివరాలు..

మండలం	2011లో	2024లో
భీంపూర్	5,241	7,780
బేల	8,559	9,885
గాదిగూడ	4,144	6,748
నార్నూర్	5,813	9,301
ఇంద్రవెల్లి	8,262	12,137
గుడిహత్నూర్	6,545	10,085
ఆదిలాబాద్‌రూరల్	9,121	11,575
ఆదిలాబాద్‌అర్బన్	30,843	44,392
తాంసి	3,947	5,378
తలమడుగు	8,503	11,598
బజార్‌హత్నూర్	6,195	9,555
నేరడిగొండ	6,500	9,235
ఇచ్చోడ	9,452	13,855
సిరికొండ	3,538	5,456
ఉట్నూర్	13,500	18,960
జైనథ్	11,374	22,019
మావల	9,463	1,686
బోథ్	11,046	14,709
సాత్నాల	-----	4,286
భోరజ్	-----	6,359
సోనాల	-----	3,982


చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వసతి గృహ విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వసతి గృహ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వారి డైట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో ఓ వసతిగృహాన్ని తనిఖీ చేసినప్పుడు విద్యార్థులు స్వయంగా మంచి ఆహారం తీసుకుంటున్నట్లు చెప్పారన్నారు. త్వరలోనే రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో నర్స్, కుక్, అధ్యాపకులతో కూడిన బృందానికి ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. విద్యార్థులకు ఆహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు తదితరులు ఉన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు జయప్రదం చేయాలి

కైలాస్‌నగర్: ఈ నెల 7నుంచి 21వరకు నిర్వహించనున్న సీఎం కప్–2024 క్రీడా పోటీలను జయప్రదం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పోటీల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. 7,8 తేదీల్లో పంచాయతీ స్థాయిలో, 10నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయంతో పనిచేస్తూ పోటీలను జయప్రదం చేయాలని కోరారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

అనంతరం పోటీలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

కైలాస్‌నగర్: నేటి నుంచి ఈనెల 9వరకు ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ఆయా శాఖల ద్వారా కార్యక్రమాలు నిర్వహించి రోజువారి నివేదికను డాక్యుమెంటరీ ద్వారా సమర్పించాలని ఆదేశించారు. ముఖ్య కూడళ్లతో పాటు కలెక్టరేట్‌ను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. ప్రాథమిక, ఉన్నత, ఇంటర్, డిగ్రీస్థాయి విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఎరోడ్రమ్ మైదానంలో శనివారం తీన్ పత్తా ఆడుతున్న నలుగురిని వన్‌టౌన్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



కాలిన పత్తి

పెంబి: మండలంలోని కోరకంటితండా గ్రామానికి చెందిన రైతు జాదవ్ ఇందల్ ఇంట్లో నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల పత్తి శనివారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అధికారులు స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గుండెపోటుతో ఎంపీడీవో మృతి



రామేశ్వర్‌రావు (ఫైల్)

లింగాపూర్: స్థానిక ఎంపీడీవో రామేశ్వర్‌రావు ఆదిలాబాద్‌లోని తన ఇంట్లో శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. రామేశ్వర్‌రావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత మార్చి నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. అతడి మృతి వార్త స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

జింకపిల్ల అప్పగింత



జింకపిల్లను అప్పగిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) గ్రామ మాజీ సర్పంచ్ అడప్ మారుతికి తన పంట పొలంలో శనివారం సాయంత్రం గాయాలతో ఉన్న జింక పిల్ల కనిపించింది. మారుతి స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. బీట్ ఆఫీసర్ ముఖరా (బి)కి చేరుకుని జింక పిల్లను స్వాధీనం చేసుకున్నారు. దానిని కవ్వాల్ అభయారణ్యానికి తరలించనున్నట్లు తెలిపారు.

వాహనం లోయలో పడి ఇద్దరికి గాయాలు

జైనూర్: వాహనం బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌నాయక్ తండా గ్రామానికి చెందిన రైతు జాదవ్ కనిరామ్ శనివారం బొలెరో వాహనంలో పత్తి లోడ్ చేసి విక్రయానికి కెరమెరికి తీసుకెళ్తున్నాడు. తాడిగూడ గ్రామ శివారులో ఈ వాహనం బోల్తా పడి డ్రైవర్‌తోపాటు అతడికి స్వల్ప గాయాలయ్యాయి. కెరమెరి ఘాట్ నుంచి చింతకర్ర వరకు రోడ్డు సరిగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

మహమ్మారి విస్తరిస్తోంది!



నిర్మల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



- అవగాహన లేనందునే పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు
- బాధితుల్లో యువతే అధికం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ డే

ఆదిలాబాద్‌టౌన్/నిర్మల్‌చైన్‌గేట్/మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లాలో ఎయిడ్స్ చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. ప్రాణాంతకవ్యాధి అని తెలిసినా కొందరు క్షణిక సుఖం కోసం జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మరికొందరు అవగాహన రాహిత్యంతో మహమ్మారి బారిన పడుతున్నారు. అవగాహన కల్పించాల్సిన వైద్యశాఖ ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. దీంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. హెచ్‌ఐవీ (హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్) బారిన పడుతున్నవారిలో యువతే అధికంగా ఉండడం గమనార్హం. జిల్లాలో ఈ ఏడాది 62 మంది వ్యాధి బారిన పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య రెండింతలు ఉండే అవకాశముంది. కొందరు ప్రైవేట్ క్లినిక్‌లలో టెస్టులు చేసుకుని చికిత్స పొందుతున్నారు. ఇంకొందరు పరీక్షలు చేయించుకునేందుకు వెనుకాడుతున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 3,87,279 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా, 1,178 మందికి పాజిటివ్‌గా నిర్ధారణైంది. 11,121 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా ఇద్దరికి హెచ్‌ఐవీ నిర్ధారణైంది. రిమ్స్‌లో వీరికి సుఖప్రసవం చేశారు. ముగ్గురు చిన్నారులకు హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా అందరికీ నెగెటివ్ వచ్చింది. 2,444 మంది బాధితులు రిమ్స్ ఏఆర్టీ, ఉట్నూర్ ఏఆర్టీ సెంటర్ల నుంచి ప్రతీనెల మందులు తీసుకెళ్తూ వినియోగిస్తున్నారు. 980 మంది బాధితులు ప్రతీనెల రూ.2,016 ఆసరా పింఛన్ పొందుతున్నారు.

‘హక్కుల మార్గాన్ని తీసుకోండి’..

ప్రభుత్వాలు ‘హక్కుల మార్గాన్ని తీసుకోండి’ అనే నినాదంతో ఈ సంవత్సరం ఎయిడ్స్ దినం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు నిర్మల్ జిల్లాలో (2008-2023 అక్టోబర్ వరకు) 2,68,481 మంది స్వచ్ఛందంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోగా 889 మందికి హెచ్‌ఐవీ సోకినట్లు నిర్ధారించారు. 2024లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 21,315 మంది హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోగా వీరిలో 59 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారించారు. 2024లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో 6,430 మంది గర్భిణులు హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకోగా వీరిలో ముగ్గురికి హెచ్‌ఐవీ సోకినట్లు నిర్ధారణైంది. 889 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులు ఏఆర్టీ కేంద్రాల నుంచి ప్రతీనెల ఏఆర్టీ మందులు తీసుకువెళ్లి వాడుతున్నారు. 952 మంది ప్రతీనెల రూ.2,016 ఆసరా పింఛన్ పొందుతున్నారు. ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పాఠశాల, కాలేజీల్లో హెచ్‌ఐవీ, టీబీ, బ్లడ్ డొనేషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు.

నిర్మల్ జిల్లాలో ఇలా..

ప్రజలు స్వచ్ఛందగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకునేందుకు జిల్లాలో 4 హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, టెస్టింగ్ సర్వీసెస్ కేంద్రాలున్నాయి. ఇందులో నిర్మల్‌లో-2, భైంసాలో-1, ఖానాపూర్‌లో-1 చొప్పున ఉన్నాయి. 16 హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, టెస్టింగ్ సర్వీసెస్ కేంద్రాలు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్నాయి. అంతే కాకుండా మూడు హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, టెస్టింగ్ సర్వీసెస్ కేంద్రాలను ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఏర్పాటు చేశారు. సుఖవ్యాధిగ్రస్తులకు చికిత్స అందించేందుకు నిర్మల్‌లో-1, భైంసాలో-1 కేంద్రం ఉంది. సురక్షితమైన రక్తం అందించేందుకు మూడు రక్త నిధి కేంద్రాలు పనిచేస్తున్నాయి. 1-9-2024 నుంచి అక్టోబర్ 31వరకు జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ యూనిట్ ఆదిలాబాద్, ఐఈసీ అండ్ ఐహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్, రక్త పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో యువజనోత్సవాల్లో భాగంగా జిల్లాలోని కళాశాల, పాఠశాల విద్యార్థులకు పరుగు పందేలు, నాటకం, చదరంగం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలు పంపించారు.

వలసలే వ్యాధికి కారణాలా?

ప్రధానంగా అరక్షిత లైంగిక సంబంధాలు, పాజిటివ్ రోగులు వాడిన సూదులు, సిరంజీలు, రేజర్లు, బ్లేడ్లు ఉపయోగించడం, రక్తాన్ని పరీక్షించకుండా ఇతరులకు ఎక్కించడం ద్వారా మహమ్మారి విస్తరిస్తోంది. ప్రస్తుత బాధితుల్లో ఎక్కువ అపరిచితులతో శృంగారం చేసిన వారే అధికం. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు.. జిల్లాలోకి వచ్చినవారితోనే ఎయిడ్స్ వ్యాప్తి చెందుతోంది,

ఆదిలాబాద్ జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షల వివరాలు

సంవత్సరం	పరీక్షలు	నిర్ధారణ
2016-17	50,830	147
2017-18	41,685	193
2018-19	38,222	145
2019-20	48,352	163
2020-21	29,337	92
2021-22	37,437	105
2022-23	43,636	125
2023-24	64,875	139
(2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు)	32,905	69
మొత్తం	3,87,279	1,178

నిర్మల్ జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షల వివరాలు

సంవత్సరం	పరీక్షలు	నిర్ధారణ
2016-17	11,982	59
2017-18	32,900	163
2018-19	36,818	154
2019-20	38,057	133
2020-21	24,403	93
2021-22	27,972	75
2022-23	33,945	105
2023-24	41,089	108
(ఏప్రిల్ 24నుంచి అక్టోబర్ 24వరకు)	21,315	62

మంచిర్యాల జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షల వివరాలు

సంవత్సరం	పాజిటివ్ కేసులు
2021-22	91
2022-23	77
2023-24	78
2024-25 (నవంబర్ వరకు)	70
మొత్తం కేసులు	1,938

మంచిర్యాల జిల్లాలో ఇలా..

హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకునేందుకు జిల్లాలో మూడు సమీకృత కౌన్సెలింగ్ కేంద్రాలు, ఫెసిలేటెడ్ ఐసీటీసీ సెంటర్లున్నాయి. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, లక్సెట్టిపేట, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రుల్లో కౌన్సెలింగ్ సెంటర్లున్నాయి. చెన్నూరు, మందమర్రిలోని కౌన్సెలింగ్ కేంద్రాలను గతేడాది ఎత్తివేశారు. ఆదిలాబాద్, గోదావరిఖనిలో సీడీ-4 పరీక్షలను ఆర్నెళ్లకోసారి, వైరల్‌లోడ్ పరీక్ష ఏడాదికోసారి చేసి అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారు. ఉమ్మడి జిల్లాలో ఎయిడ్స్ రోగులకు చికిత్సతో పాటు మందులు అందించే ఏఆర్టీ సెంటర్ ఆదిలాబాద్‌లోనే ఉండడం, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల ప్రజలకు దూరభారం కావడంతో గోదావరిఖనిలోని ఏఆర్టీ సెంటర్ నుంచి సేవలు పొందుతున్నారు. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో మంచిర్యాలకూ ఏఆర్టీ సెంటర్ మంజూరు చేయగా, రెండు నెలల్లో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ ఏఆర్టీ కేంద్రం ఏర్పాటైతే మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల బాధితులకు సత్వర సేవలు అందే అవకాశముంది. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎస్‌టీఐ, ఆర్టీఐ వ్యాధిగ్రస్తుల చికిత్స కేంద్రంలో ప్రతీనెల పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. జిల్లాలో స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బారిన పడ్డ వారికి మనోధైర్యాన్ని అందించి, వారి వైద్యానికి అవసరమయ్యే సహాయ సహకారాలు అందిస్తున్నారు. సుఖవ్యాధులకు పూర్తిస్థాయిలో చికిత్స, మందులు అందజేసి కౌన్సెలింగ్ ఇప్పిస్తారు.

వ్యాధి లక్షణాలు..

హెచ్‌ఐవీ బారిన పడిన వారిలో మొదటి దశలో ఫ్లూజ్వరం, రక్తంలో వైరస్ సంఖ్య అధికంగా ఉన్న ప్రతి రక్షకాలు కనిపించవు. రెండో దశలో హెచ్‌ఐవీ ఉనికి తెలుస్తుంది. మూడో దశలో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. నాలుగో దశలో దీర్ఘకాలిక జ్వరం, నీళ్ల విరోచనాలు, నోటి పుళ్లు, లింప్ గ్రంథులు వాచడం, శరీర బరువు పది శాతం కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. హెచ్‌ఐవీ పరీక్షల కోసం ముందుకు రాని వారికి, వివక్షకు గురయ్యేవారికి ఎయిడ్స్ హెల్ప్‌లైన్ 1097 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు.

నిశ్శబ్దాన్ని ఛేదించాలి



హెచ్‌ఐవీ సోకిందని నిశ్శబ్దంగా ఉండడం కంటే ఏఆర్టీ కేంద్రాన్ని సంప్రదించి మందులు తీసుకోవాలి. హెచ్‌ఐవీని నివారించలేక పోయినా జీవిత కాలాన్ని పొడిగించుకునే అవకాశముంది. కౌన్సెలింగ్ ద్వారా బాధితులకు మనోనిబ్బరం కలుగుతుంది. లేకుంటే ఆ వ్యక్తుల మానసిక స్థితి చాలా విలక్షణంగా మారిపోతుంది. రోగి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవచ్చు. – సుదర్శన్, నిర్మల్ ఐసీటీసీ కేంద్రం కౌన్సిలర్

అహర్నిశలు కృషి చేస్తున్నాం



జిల్లా నుంచి ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. వ్యాప్తిని అరికట్టేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. మందుల కొరత లేకుండా చూస్తున్నాం., బాధితులంతా మందులు వాడేలా చర్యలు చేపడుతున్నాం. పీహెచ్‌సీలకు వచ్చేవారికి హెచ్‌ఐవీ టెస్టులు చేస్తున్నాం. ర్యాలీలు, కళాజాతల ద్వారా ఎయిడ్స్ తీవ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.
– డాక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్, నిర్మల్

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం పట్టాయి. హెచ్‌ఐవీ సోకిన వారు జాగ్రత్తలు తీసుకుంటే ఆయుష్షును పొడిగించుకోవచ్చు. రోగ నిరోధక శక్తి తగ్గకుండా ఉండేందుకు ఏఆర్టీ మందులు వాడాలి. మద్యం, పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండాలి. యోగా, వ్యాయామం చేయాలి. పండ్లు, పాలు, గుడ్లు, పప్పుధాన్యాలు తీసుకోవాలి.
– నరేందర్ రాథోడ్, ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో

అవగాహనతోనే నియంత్రణ



హెచ్‌ఐవీ పరీక్షల్లో పాజిటివ్ వస్తే బాధితులు వెంటనే మందులు వాడటం ప్రారంభించాలి.. జిల్లాలో బాధితుల సంఖ్య తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాకు ఏఆర్టీ సెంటర్ మంజూరు కావడంతో బాధితులకు పూర్తిస్థాయి సేవలు అందనున్నాయి. వైద్య సిబ్బందితో పాటు దిశ ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థలు, ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలి.
– హరీశ్‌రాజ్, మంచిర్యాల డీఎంహెచ్‌వో

అటవీ ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శర్వానన్

నిర్మల్‌టౌన్: జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వివిధ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ.. అడవికి నిప్పు అంటుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, నిర్మల్ డీఎఫ్‌ఆర్వోలు రామకృష్ణారావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, రాథోడ్ అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య!

- ఆలస్యంగా ఘటన వెలుగులోకి..
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



లక్ష్మి (ఫైల్)



కుటుంబీకులతో మాట్లాడుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ నాలుగు రోజుల క్రితం మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, మహిళ మృతిపై స్థానికులు, పోలీసులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తంజేస్తున్నారు. స్థానిక సీఐ ప్రమోద్‌రావు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం జెండ వెంకటపూర్ గ్రామానికి చెందిన కూస లక్ష్మి (55)కి వివాహమైన కొద్దిరోజులకే భర్తతో విడిపోయింది. పదేళ్ల క్రితం మంచిర్యాలలోని గణేష్‌నగర్‌కు వచ్చింది. లక్ష్మితోపాటు అదే గ్రామానికి చెందిన భీమక్క ఓ ఇంటిని కొనుగోలు చేసి అందులోనే ఉంటున్నారు. వీరు కూరగాయలు, బియ్యం వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నారు. నాలుగురోజులుగా ఇంటికి తాళం వేసి ఉండడం, పైగా ఇంట్లోంచి దుర్గంధం వ్యాపించడంతో స్థానికులు, బంధువులు కిటికీ తలుపులు తీసి చూడగా లక్ష్మి బెడ్‌పై మృతి చెంది ఉంది. వారిచ్చిన సమాచారంతో వచ్చిన పోలీసుల సమక్షంలో తలుపు పగులగొట్టి పరిశీలించారు. లక్ష్మి మృతదేహం ఇంట్లో ఉండగా బయట డోర్ లాక్ చేసి ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమానాస్పద మృతిగా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, వ్యాపారంలో ఎవరితోనైనా శతృత్వం ఉందా.. ఎవరైనా దొంగతనం చేసేందుకు వచ్చి హత్య చేసి పారిపోయారా.. ఆమె నుంచి విడిపోయిన భర్తే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడా.. అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, భీమక్క నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆర్జీయూకేటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాం



కార్యక్రమానికి హాజరైన అధికారులు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీలో కొత్తగా నమోదు చేసుకున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీ దర్శన్, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యాలు, కార్యకలాపాలు ప్రయోజనాలను పరిచయం చేశారు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, విపత్తులపై ప్రతిస్పందన వంటి అంశాలపై ప్రదర్శనలు, చర్చలు ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. యువతలో సామాజిక బాధ్యత, సానుభూతి, సేవాభావాన్ని పెంపొందించడానికి ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీ దర్శన్ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రాముఖ్యత గురించి చెప్పారు. నేటి ప్రపంచంలో సామాజిక బాధ్యత, సానుభూతి ఎన్‌ఎస్‌ఎస్ సమాజ శ్రేయస్సుకు చేపట్టాల్సిన చర్యల ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ఏవో రణధీర్ సాగి మాట్లాడుతూ.. కొత్త వలంటీర్ల పాత్ర, బాధ్యతలను వివరిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్, ప్రోగ్రాం ఆఫీసర్లు కూడా ఆర్జీయూకేటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. చివరకు నూతన వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రగ్స్ నివారణ పోస్టర్ ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ విద్యార్థి పని చేయాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో ప్రేంసాగర్‌రావు, యాదయ్య

దండేపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సూచించారు. మండలంలోని రెబ్బనపల్లిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. ఈ పోటీల్లో తెలంగాణలోని పాత 10 జిల్లాలకు చెందిన సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ తిరుపతి, డీఈవో యాదయ్య, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఫణిరాజా, హెచ్‌ఎం రాజు, లక్సెట్టిపేట ఏఎంసీ చైర్మన్ ప్రేంచంద్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పీఈటీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కు‘బడి’ కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల తీరును వివరిస్తూ శనివారం ‘సాక్షి’లో మొక్కు‘బడి’ శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ రాజర్షి షా ఆరా తీసినట్లు తెలుస్తోంది. స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలకు హాజరైన ఆయన డీవైఎస్వో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమన్నను పిలిచి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.

బాలుడి అప్పగింత

నర్సాపూర్ (జి): కుంటాల మండలం కల్లూరు గ్రామ ఎస్‌ఎంఎస్ నవోదయ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థి (9) గోడ దూకి తన గ్రామమైన బొప్పారానికి ఎన్‌హెచ్-61 మీదుగా శనివారం తెల్లవారుజామున 3గంటలకు నడుచుకుంటూ వెళ్తుండగా నర్సాపూర్ (జి)లో పెట్రో కార్ సిబ్బంది సంజీవ్, వినోద్ గుర్తించారు. అతడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను నర్సాపూర్ (జి) పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. ఎస్సై హన్మాండ్లు కౌన్సెలింగ్ నిర్వహించి బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిందితుల రిమాండ్

బజార్‌హత్నూర్: భూతాయి(బి) గ్రామానికి చెందిన గడేవార్ దత్త, గడేవార్ విజయ్, గడేవార్ ప్రకాశ్, కాల్‌బుర్గే గణేశ్ గత నెల 14న ఇదే పంచాయతీ పరిధి కొలంగూడకు చెందిన రాథోడ్ సురేశ్, అతడి కుటుంబీకులను కులం పేరుతో దూషించారు. దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో రాథోడ్ సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి విచారణ చేపట్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏ-1 గడేవార్ దత్త పరారీలో ఉండగా, ఏ-2 విజయ్, ఏ-2 ప్రకాశ్, ఏ-3 గణేశ్‌ను శనివారం బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కిరాణాలు, హోటళ్లపై దాడులు



శాంపిళ్ల వివరాలు నమోదు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో మూడు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని కీర్తి ట్రేడర్స్ దుకాణంలో కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు శనివారం తేలడంతో కేసు నమోదైంది. నికోటిన్ పదార్థం ఉన్నట్లు అనుమానిస్తున్న రాజ్ నివాస్ జర్దాతో పాటు అనుముల పప్పు శాంపిల్స్ సేకరించారు. లైసెన్స్ లేకుండా దుకాణం నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు. అలాగే విశ్వ సూపర్ మార్కెట్, రాజ్ జనరల్ స్టోర్స్‌లో కాలం చెల్లిన వస్తువులు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. బేకరీల్లో లేబుల్ లేని వస్తువులు, రెస్టారెంట్లలో కలర్లు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. గత నెలలో శ్రీలక్ష్మి కారా నిబంధనలకు విరుద్ధంగా మార్కెటింగ్ చేస్తుండటంతో రూ.50 వేల జరిమానా విధించామన్నారు. పట్టణంలోని అక్షర రెస్టారెంట్‌లో కాలం చెల్లిన వెల్లుల్లి పేస్ట్ వినియోగించినట్లు గుర్తించి జరిమానా విధించామని తెలిపారు. సేకరించిన శాంపిళ్లు ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్టుల ఆధారంగా కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

హైటీకాస్ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

కడెం: ఉడుంపూర్ గ్రామంలో హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హైటీకాస్) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని ఉడుంపూర్ ఎఫ్‌ఆర్వో అనిత, హైటికాస్ ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ వెంకట్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన 25మంది మహిళలకు మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాల యువతకు హైటికాస్ ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ప్రతినిధి వెంకట్ తెలిపారు. డీఆర్వో ప్రకాశ్, ఉడుంపూర్ రేంజ్ సిబ్బంది, మాజీ సర్పంచ్ కుర్ర లక్ష్మి ఉన్నారు.



అధికారులతో శిక్షణ పొందుతున్న మహిళలు